# చేపగాడు

వాణ్ణి... మావూళ్లో అందరూ 'చేపగాడు' అంటారు. చేపగాడసలు పేరేంటో అతగాడు కూడా మర్చిపోయి వుంటాడు!

లాకులు దగ్గర సూపర్‌వైజర్‌తో బాటు ఎక్కువ కనిపిస్తాడు వాడు! కాలవలో మనుషులో, మరో విలువైన జంతు కళేబరాలో కొట్టు కొస్తుంటే, అమాంతం నీట్లో దూకి, పైకి తీసి సూపర్‌వైజర్‌కి అప్పగిస్తాడు. ముఖ్యంగా కాలవకి నీళ్లొదిలాక పోటెత్తిన గోదావరిలా గలగల్లాడుతూ నిండుగా పొర్లుతున్నప్పుడు ఒక్కోరోజు రెండు మూడుసార్లు కూడా నీట్లోకి దూకాల్సి వస్తుంది. గోదావర్లోనో ఎగువ కాలవలోనో, ప్రమాదవశాత్తూ గానీ మరే కారణంవల్ల గానీ పడిపోయిన మానవ ఆకారాలు బైటకి తీసి అయినవాళ్లకోసం ఎదురుచూస్తాడు.

అవి ఆత్మహత్యలాంటి సంఘటనలైతే ఆ అయినవాళ్లు నేర భయంతో అటువైపు రారు. వీలైనంత తప్పించుకుంటారు.

ప్రమాదవశాత్తూ జారిపడితే గవర్నమెంట్ తృణమో పణమో అంత్య క్రియలకి ఇస్తుంది- ఆ వ్యక్తి సంబంధీకులకి.... దానికోసం కూడా శవం కోసం వస్తారు.

అలాంటప్పుడు... 'చేపగాడుగారూ...' అంటూ ఏభయ్యో వందో చేతిలో పెట్టబోతారు ఆ వచ్చిన సంబంధీకులు.

చేపగాడికా సొమ్ము అక్కర్లేదు. ఎడ్రస్‌లేని వ్యక్తుల్ని పంచనామాలు గట్రా అయాక... బండిలో వేసి స్మశానానికి తీసుకెళ్లి ఖననం చేయించ డానికి ఆ డబ్బు సూపర్‌వైజర్‌గారి దగ్గరే ఓ రేకుడబ్బాలో దాచి ఉంచుతాడు అతగాడు.

చేపగాడు మొదటిసారి కాలవలో దూకినప్పుడు ఈతరాదు. నీళ్లంటే చచ్చేంత భయం కూడా. అలా దూకాల్సి వచ్చినప్పుడు పై రెండు విషయాలూ ఆలోచించే వ్యవధి లేదు.

+ + +

ఆరోజు బాగా ముసురుగా వుంది. ఐదు గంటలకే దీపాలవేళ అయిపోయినట్టుంది. పొద్దుణ్నించీ సూరీడు వచ్చిన జాడలేదు. ఆ కాలవవతల నాలుగు మైళ్లెలితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. పెళ్లాం తిరుమలిని ఆరోజు సాయంత్రం 6 గంటలకి తీసుకు రమ్మంది పెద్ద డాక్టరమ్మ. ఆవిడ 4 రోజులకొకసారే ఆ వూరు ఆసుపత్రికి వస్తుంది. 'మబ్బైనా వానైనా ఇవ్వాళ వెళ్లి తీరాల్సిందే' తల్లి తిరుమలిని కంగారు పెట్టింది.

ఐదో నెలలో... ఓసారైనా చూపించుకోవటం మంచిదని చుట్టు పక్కల ఆడంగులంతా సోదెట్టేస్తున్నారు.

మొగుడు కూడా వానకి చిరాకుపడి వెచ్చగా ఇంటి పట్టున ఉండిపోయాడు ఆవేళ- చూస్తో చూస్తోంటే... 4 దాటింది. పెళ్లాం ముడుచుకుపడుకుంటే.... కుదిపి కుదిపి లేపి ఆసుపత్రి కెళ్లటానికి బుజ్జగించి రడీ చేసాడు.

కాలవ దాటాలి. బల్లకట్టు బాలయ్య లేడు.

అది అవతలిగట్టు దగ్గర రిలాక్సవుతోంది.

తాడు గుంజాడు. బల్లకట్టు వస్తోంది. వానలు బాగా పడటంతో గోదావరి నిండింది. పొంగకుండా ఆనకట్ట ఎత్తేరేమో కాలవనీళ్లు వడి వడిగా పరిగెడుతున్నాయి.

మామూలుగా బల్లకట్టు ఏ గట్టునున్నా కావల్సిన వొడ్డుకి తెచ్చుకునే వొడుపు స్కూల్ పిల్లలనుంచి, నడుము వంగిన తాతకైనా తెలుస్తుంది. మొనగాడిలా అర క్షణంలో బల్లకట్టుని అతిలాఘవంగా ఇవతలి వడ్డుకి తెస్తున్న మొగుణ్ని చూసి మురిసిపోయింది తిరుమలి.

సన్నగా చినుకులు మొదలయ్యాయి. చివ్వుమంది చలికి.. కడుపులో బిడ్డకేమో ఆ చివ్వు- వళ్లాంతా జివ్వుమనిపించింది. కనబోతున్న తల్లికి- భుజం మీద పైట కిందికి లాగి లోపలున్న బుజ్జి దానికి కప్పింది పిచ్చితల్లి.

బల్లకట్టు బంకపేరి, చినుకులకి తడిసి జారుతోంది. చుట్టూ ఎవర్లేరు గనుక... కావల్సిన దానికన్నా జాగ్రత్తగా, గుచ్చి పట్టుకున్నాడు అతడు. ఆమె మరింత ధైర్యంగా వొదిగిపోయింది. కాదు, ధైర్యానికి వొదిగి పోయింది. జాగ్రత్తగా ఆమెనెక్కించి బ్రేకు లాగాడు.

బల్లకట్టు నడుస్తోంది. అద్దరి నుంచి ఇద్దరికి కట్టిన ఇనప తీగ ఆసరాగా నెమ్మదిగా అవతల ఒడ్డుకు చేరడానికి లాగుతున్నాడు. వానజడి ఉధృతమైంది. బల్లకట్టు అనూహ్యంగా తొణికిసలాడింది. కెవ్వుమన్న కేక... తిరుమలి తుళ్లి తూలి పడిపోయింది.

చెంగున నీటిలో దూకాడు మొగుడు.

కేకలు వినిపించిన వైపు చేరాలంటే.... ఎలా ఈదాలో తెలియని వాడు. ఇంతవరకూ... సన్నటి కాలువలో కూడా కాళ్లు కడుక్కోలేని

పిరికితనం... అతనిది.

ఎలా వచ్చిందో అంత తెలియని ధైర్యం.

నీళ్లల్లో పడ్డాక ప్రాణాలు కాపాడుకోవడం తెల్సింది!!

దానిపేరు 'ఈత' అని అప్పటికి తెలియదు అతనికి!!

భార్యకోసం దేవులాడాడు- ప్రతీ అలా కెలికి వెతికాడు.

ప్రాణం పణం పెట్టి చీకట్లని చీల్చుకుంటూ కాలవలో కల తిరిగాడు... నిండా మునిగాక కుండపోతగా వర్షం పడుతున్నా గమనించలేదు.

నాలుగైదు మైళ్లు ఈదాక... కింద లాకులు వచ్చాయి.

తలుపులెత్తేశారు. ఉసూరుమంది ప్రాణం. ఎలాగో ఒడ్డెక్కాడు. భోరున ఏడిచాడు.

✦ ✦ ✦

తిరుమలి దొరకలేదు. రెండు రోజులు గట్టంట చూస్తూ నడిచాడు. కళ్లల్లో కాలువలు పొంగుతున్నాయి. కనకాంబరం రంగు చీర... నారింజ రంగు జాకెట్!

ఎర్రటి కొత్త కాలవ నీళ్లలో కలిసిపోయాయా? ఆ రంగులు వెలిసిపోయాయా?

మళ్లీ ఓ గట్టు నుంచి కాలవలో దూకాడు. ఇప్పుడు ఈత రాదని తెల్సున్నా చచ్చినా పరవాలేదన్న ధైర్యంతో దూకాడు. అలా రెండ్రోజులు... ఎక్కడ గట్టు ఎక్కుతున్నాడో, ఎక్కడ కాలవలో దిగుతున్నాడో తెలియనంతగా ముందూ వెనకా చూడకుండా, వేళ్లతో కాళ్లతో... వెతుకుతూ నీటి లోతుల్ని కెలుకుతూ... ములుగుతూ తేల్తూ కన్నీటితో

కాలవ మట్టాన్ని పెంచేస్తున్నాడు.

ఎదురొచ్చే వాళ్లని అడుగుతున్నాడు- "కనకాంబరం రంగు... చీరా"

"ఈపాటికి సముద్రంలో కెళ్లి పోయుంటది బాబూ... కాలవ పొడుగూతా లాకులు ఎత్తేసారు..." ఈ నిజాన్ని చెప్పాలనిపించేది కాదు. పుణ్యామో పాపమే... జాలిపడుతూ వెళ్లిపోయేవారు వాళ్లతని బాధ చూసీ... చూళ్లేకా-

ఆ 'ఈత' ఎన్ని మైళ్లు సాగిందో... ఎన్ని రోజులు పట్టిందో- తనే వూరి వడ్డున ఉన్నాడో గమనించలేని స్థితిలో.... ఓ ఉదయం... అతని ఆయుర్దాయం అతన్ని ఓ గట్టుమీదకి విసిరి స్పృహ తెప్పించింది.

నీరసం! నిస్త్రాణా! ప్రాణం కుదుట పడ్డాక... గుండె కుదుట బెట్టుకున్నాడు. రోడ్డెక్కి ఇంటి కెళ్లాలనిపించలేదు. ఆఖరి ప్రయత్నంగా... ఎదురీతతో తన వూరు గట్టెక్కాడు. ఆ మధ్యలో కూడా ఎదుర్రాలేదు తిరుమలి- కానీ ఈ మధ్యలో అతనికి గజయీతగాడనీ, చేపగాడనీ పేరొచ్చింది.

రెండేళ్లు గడిచిపోయాయి. ఈ రెండేళ్లూ కాలవలో ఎవరైనా కొట్టుకుపోతున్నా... ఏదైనా జారిపోతున్నా ఈది వడ్డుకు చేర్చడం అతనికి వృత్తి వ్యావృత్తి అయిపోయింది.

లాకు సూపర్నెంట్ చలపతిరావుగారు చేపగాడి సేవ, చావ, యావా కూడా గమనించి చేరదీశారు.

ఆ రకంగా చేపగాడికో పని దొరికింది.

పొద్దున్న టిఫెనూ, మధ్యాహ్నం, రాత్రీ భోజనాలూ చేపగాడూ చలపతిరావుగారూ కల్సి వండుకుంటారు. ఇద్దరూ కల్సి భోజనం చేస్తారు.

చలపతిరావుగారు... చేపగాడి గుండె లోతుల్లో తొంగి చూసి స్నేహంగా లాలనగా ఓదార్చేవాడు. తిరుమలిపై అతనికున్న ప్రేమకి ముగ్ధుడైపోయేవాడు.

ప్రేమించడం తెల్సిన వ్యక్తి అంటే ఆయనకెంత ప్రేమో చేపగాడిని చూసే కళ్లల్లో కనిపించేది-

ఓరోజు రాత్రి చలపతిరావు అలవాటుగా మందు కొడుతూ ఓ గ్లాసు చేపగాడికి ఆఫర్ చేశారు.

"మానేశానండి... మా తిరుమలి పెళ్లయినరోజే ఒట్టేయించుకుంది"

"నాకు తెలుసురా... అనుక్షణం పోయినవాళ్లని తలుచుకుని బాధ పడేకన్నా..."

"తిరుమలి పోలేదండి... ఇంకా... ఇక్కడే వుంది" గుండెమీద చెయ్యేసుకు చెప్పాడు.

చలపతిరావుగారికి గుండె చెరువైంది.

"కొన్ని మరచిపోవటానికి మందు... మంచి మందురా"

"అయ్యగారూ... నేను తనని మరచిపోవాలని అనుకోట్లేదు కదండీ.."

చలపతిరావుగారికి ఇంక మాటలు దొరకలేదు.

మర్నాడు... టిఫిన్ చేసి ఇద్దరూ లాకులు దగ్గరకి వెళ్లారు.

దూరంగా ఏం చూశాడోగానీ హఠాత్తుగా కాలవలో దూకాడు చేపగాడు.

చలపతి అర్థంకాక ఉలిక్కి పడ్డాడు-

కొంతసేపు... తన చూపుకి కనిపించాడు గానీ, తర్వాత కళ్లజోడు పవరు చాల్లేదు.

మరికొంతసేపటికి... గట్టుమీంచి తడిసిన బట్టల్తో పరుగులెడుతూ రెండేళ్ల పాపని భుజాన్నేసుకు వచ్చాడు. చేపగాడు.

పాప బతికే వుంది. స్పృహలో లేదు. ఇద్దరూ ఫస్ట్ ఎయిడ్ చేశారు.

పాప బతికింది.

ఊరూ పేరూ చెప్పే మాటలు రాలేదింకా-

✢ ✢ ✢

పాపని తీసుకోడానికి ఎవరూ రాలేదు.

చేపగాడికీ... చలపతిరావుకీ కొత్త బాధ్యత వచ్చింది. ఆయన లాకులుకెళ్తేనా చేపగాడు పాపని చూసుకోడానికి ఆగిపోయేవాడు.

ఓరోజు చలపతిరావు పరిగెట్టుకొచ్చాడు. "లాకు దగ్గర కాలవలో ఎవరిదో శవంరా... చేపగాడా..."

"రంగణ్ని పిలవండి అయ్యా... నేనింకా కాలవలో దూకను"

"ఒరే... ఏంట్రా నువ్వనేది..."

"అవును బాబూ... ఇవ్వాళ నుంచి నాపేరు చేపగాడు కాదు బాబూ.. పాపగాడు. ఈ పాప మా తిరుమలి కన్నబిడ్డ. నా కోసం ఇచ్చిన బిడ్డ... దీన్ని పెద్ద చెయ్యాలి. దీనికి పెళ్లి చెయ్యాలి. లేకపోతే మా తిరుమలి వప్పుకోదు"

"శభాష్‌రా చేపగాడా... అహా పాపగాడా" అన్నాడు చలపతిగారు.

కళ్లలో కాలవ పొంగుతుండగా....!!

